క్లుప్తంగా

సీఎం సహాయనిధితో పేదలకు మేలు



చెక్కులు పంపిణీ చేస్తున్న సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం సహాయ నిధితో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన 41మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1,33,600ల విలువ గల చెక్కులను శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం సహాయ నిధి పథకం ద్వారా లక్షలాది మంది పేద ప్రజలకు సహాయం అందుతుందన్నారు. పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిజికల్ డైరెక్టర్స్, టీచర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన వారికి నియామక పత్రం అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఫిజికల్ డైరెక్టర్స్, టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా బొమ్మపాల గిరిబాబు, అధ్యక్షుడిగా ఇమాం కరీం, ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, కవిత, కోశాధికారిగా ఎం.బాలరాజుయాదవ్, ఉపాధ్యక్షుడిగా కేతావత్ శ్రీనివాస్, ఎండీ.అజీజ్ ఎన్నికయ్యారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేట్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గండిచెరువు చంద్రశేఖర్, నియోజకవర్గ అధ్యక్షుడు బొల్ల నాగరాజు, ఎలిజాల రమేష్, శ్రీరంగం, గడగోజు విజయ్, సాయి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎస్‌ను కలిసిన డ్యాబ్ ప్రతినిధులు



విజయానంద్‌ను కలిసి ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న డ్యాబ్ సంస్థ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను డ్యాబ్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఏపీలోని అమరావతిలో కలిశారు. ఆయన ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 2016 ప్రకారం దివ్యాంగులకు రాష్ట్ర స్వతంత్ర కమిషనర్‌ను నియమించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయనకు మెమోరాండం అందజేశారు. అన్ని రాష్ట్రాలలో దివ్యాంగుల కమిషనర్‌లను నియమించాలని కోరుతూ అన్ని రాష్ట్రాల సీఎంలు, సీఎస్‌లకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

కిరాణా దుకాణాలలో అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

నాంపల్లి : మండల కేంద్రంలోని పలు కిరాణం, కూల్‌డ్రింక్స్ దుకాణాలలో తూనికలు, కొలతల అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్న మూడు దుకాణాలపై కేసులు నమోదు చేసి మిగతా వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ లీగల్ మెట్రాలజీ శ్రీనివాసులు మాట్లాడారు. వస్తువులను ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయించరాదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట టెక్నికల్ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ఇష్టానుసారంగా రోడ్డు విస్తరణ పనులు

- పూర్తిస్థాయిలో చేయని మార్కింగ్
- కొలతల వివరాలు తెలపని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న నాంపల్లి ప్రజలు



నాంపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

నాంపల్లి : చండూరు మండలం బంగారిగడ్డ నుంచి నాంపల్లి మీదుగా కొండమల్లేపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతోపాటు నాంపల్లి మండల కేంద్రం నుంచి మూడు వైపులా నాలుగు కిలోమీటర్ల వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణతోపాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.24 కోట్ల నిధులు మంజూరు చేసింది. అదే విధంగా నాంపల్లి నుంచి చండూర్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు, డ్రెయినేజీకి రూ.3.5 కోట్లను మంజూరు చేసింది. మండల కేంద్రంలో ఒకవైపు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న డబ్బాలు, దుకాణాలు, ఇళ్లను తొలగిస్తున్నారు. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణకు సరైన కొలతలు ఇవ్వకపోవడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. రోడ్డు సెంటర్ నుంచి కొలతలను అధికారులు కొంత మేరకు వేశారు. దీంతో కాంట్రాక్టర్ ఆ నిర్మాణాలు తొలగిస్తున్నారు. కొంత మేరకు రోడ్డుకు సెంటర్ నుంచి 31 ఫీట్లు అని, కొంత వరకు 33 ఫీట్లు అని మార్కింగ్ ఇచ్చారు. 40 ఫీట్లు వరకు తొలగిస్తారని తెలియడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలు తొలగించడానికి అధికారులు సమయం ఇచ్చినప్పటికీ సరైన కొలతలు తేలకపోవడంతో రోడ్డు వెంట ఉన్న దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్

రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు కొంత మేరకు కొలతలు వేశారు. వాటి ప్రకారంగా నిర్మాణాలను కూల్చివేయకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని నిర్మాణాల వద్ద ఒకలా.. మరి కొంత మంది నిర్మాణాల వద్ద మరోలా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. అధికారులు నిబంధనల ప్రకారం పక్కాగా కొలతలు వేసి ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ముందస్తుగా కొలతలు వేయాలి



రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు రోడ్డు కొలతలు ముందస్తుగా వేస్తే బాగుంటుంది. ముందుగా కొలతలు వేస్తే విస్తరణకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించుకోవడానికి వీలుంటుంది.

– మహ్మద్ రఫీమీయా, నాంపల్లి

నాంపల్లి దశ తిరగనుంది



అభివృద్ధిలో వెనుకబడిన నాంపల్లి మండలం దశ తిరగనుంది. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చొరవతో ప్రభుత్వం రోడ్లకు నిధులు భారీగా మంజూరు చేసింది. దీంతో ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.

– కత్తి రవీందర్‌రెడ్డి, నాంపల్లి

రోడ్డు వెడల్పు 66ఫీట్లు ఉంటుంది

నాంపల్లి మండల కేంద్రం నుంచి నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ రోడ్డు మధ్యలో నుంచి ప్రస్తుతం 33 ఫీట్ల వరకు కొలతలు వేస్తున్నాం. దాని తర్వాత విద్యుత్ స్తంభాల కోసం 5 ఫీట్ల వరకు తీయాల్సి ఉంటుంది. చౌరస్తాకు సంబంధించిన రోడ్డు కొలతలు ఎంత అనేది నిర్ణయించలేదు. చుట్టూ రోడ్ల విస్తీర్ణం బట్టి అంబేద్కర్ చౌరస్తా సర్కిల్‌రింగ్ కొలతలు వేస్తాం. రోడ్డు వెడల్పు 66 ఫీట్లు ఉంటుంది.

– పగడాల వికాస్, ఆర్‌అండ్‌బీ ఏఈ నాంపల్లి

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్

మునుగోడు : జిల్లాలోని చలకుర్తిలో గల జవహర్‌లాల్ నవోదయ పాఠశాలలో చేరేందుకు శనివారం 6వతరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రవేశపరీక్షకు మండల కేంద్రంలో అధికారులు శుక్రవారం ఏర్పాటు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 201మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లించగా, వారికి మండల కేంద్రంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ టి.మల్లేషం తెలిపారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు వెంట హాల్‌టికెట్‌తో పాటు పరీక్ష ప్యాడు, బ్లూ, బ్లాక్ పెన్నులతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. పరీక్ష ఉదయం 11గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 1గంట 30నిమిషాల వరకు జరుగుతుందని, విద్యార్థులు ఉదయం 10గంటల 30నిమిషాలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత



శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న సభ్యులు

రామగిరి (నల్లగొండ) : పట్టణంలో యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నాలుగు నెలలుగా మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శుక్రవారం సాగర్ ఎక్స్‌రోడ్డులోని హిమగిరి కాలనీలో సర్వీస్ నౌ కంపెనీ సహకారంతో కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా అడ్వైజరీ బోర్డు మెంబర్ వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, ఒకేషనల్ జూనియర్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్ లక్ష్మి, యూత్ ఫర్ సేవా రీజినల్ కోఆర్డినేటర్ సునీల్, యూత్ ఫర్ సేవా సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని ఇసుక సరఫరాతో ఇక్కట్లు



మునుగోడు రీచ్ నుంచి మట్టితో కూడిన ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

మునుగోడు : ఇండ్ల నిర్మాణాలు, ఇతర కట్టడాలకు ఇసుక తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఇసుకను అక్రమంగా తరలించకుండా ప్రభుత్వమే కావాల్సినవారికి సరఫరా చేసే విధంగా ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంతో ఇసుకను కావాల్సినవారు కావాల్సినంత ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే ప్రభుత్వమే నేరుగా సరఫరా చేస్తుంది. మండల ప్రజలకు స్థానిక ఇసుకవాగులోని రీచ్ నుంచి గత కొన్ని నెలలుగా సాండ్ టాక్సీ ద్వారా రవాణా చేస్తున్నారు. యజమానులు ట్రాక్టర్‌లో ఇసుకను నిండా తీసుకురాకుండా ఉన్నదానిలో సగానికిపైగా అంతా మట్టి వస్తుండడంతో నాణ్యత ఉండడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ట్రాక్టర్ యజమానులు అవేవి పట్టించుకోకుండా ఆ మట్టి ఇసుకను లోడు చేసుకొని సరఫరా చేస్తున్నారు. దీంతో తాము డబ్బులు చెల్లించి ఇసుక కొనుగోళ్లు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని వినియోగదారులు వాపోతున్నారు. తమకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారే లేరని వాపోతున్నారు. దీంతో చేసేది లేక మండల ప్రజలు ఇక్కడి ఇసుకను వాడకుండా విజయవాడ, కాళేశ్వరం ఇతర ప్రాంతాల నుంచి తెపించుకొని తమ నిర్మాణాలు చేపడుతున్నారు.

వెలిమినేడులో కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామంలో డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సహస్ర ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం డ్రైవర్లకు, గ్రామస్తులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 150మంది గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకోగా అవసరమైన 40మందికి మందులు, అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పాల సంఘం చైర్మన్ మారగోని యాదయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుర్కంటి సత్తిరెడ్డి, కార్యదర్శి చిర్రగోని శ్రీశైలం, డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మమద్ కాజా పాషా, గోలి గణేష్, అంశాల సత్యనారాయణ, అర్రూరీ నర్సింహ, అంతటి వెంకటేశం, మంకాల లింగస్వామి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీవారిజాల వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం మన ఊరు – మన గుడి కార్యక్రమం స్ఫూర్తితో స్థానిక సన్‌షైన్ అవెన్యూకాలనీ అధ్యక్షుడు కొప్పు రాము తమ తల్లిదండ్రులు కొప్పు నర్సింహ–ఉత్తరమ్మ జ్ఞాపకార్థం రూ.12500ల విలువ చేసే అభిషేకం పాత్రను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కారంపూడి వెంకటాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి ప్రసాద్, రాజు రమేష్, దోసపాటి విష్ణుమూర్తి, పసునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రచారంలో పాల్గొన్న హర్షవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

నల్లగొండ : తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలిసి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని పెద్దబండలో కుమ్మర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమంచి వెంకటేశ్వర్లు, రాధారపు భిక్షపతి, ఆమంచి రాజలింగము, ఏడుకొండల వెంకటేశం, గంగాధర వెంకటేశ్వర్లు, చిట్టిమల్ల దశరథ, బొడ్డుపల్లి రమేష్, కంచర్ల రాము, ఆమంచి శరత్, నిమ్మనగోటి శ్యాంప్రసాద్, ఎలిజాల వెంకన్న, కంభంపాటి భిక్షం, బండారి అంజయ్య, ఆమంచి శ్రీనివాస్, తాండూరు చంద్రం, బండారి సత్యనారాయణ, రాధారపు యాదగిరి, ఆమంచి మధు, ఎర్ర సైదులు, అరూరి భాస్కర్, ఎర్ర అంజయ్య, సిరసవాడ లక్ష్మయ్య పాల్గొన్నారు.

సర్వేను సమర్థంగా నిర్వహించాలి



నకిరేకల్ : తాటికల్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి



కేతేపల్లి : కొర్లపహాడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నకిరేకల్ : ప్రభుత్వం రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వేను సక్రమంగానిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఆర్లగడ్డగూడెం, తాటికల్ గ్రామాల్లో అధికారులు చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సేద్యం అవుతున్న భూములు, సేద్యం కాకుండా ఉన్న భూమలపై పక్కాగా వివరాలు సేకరించాలన్నారు. అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేలా జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఆయన వెంట నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ జమురుద్దీన్, వ్యవసాయాధికారి జానిమియా, తదితరులు ఉన్నారు.

కేతేపల్లి : రైతు భరోసా అమలులో భాగంగా నిర్వహిస్తున్న సర్వేలో సాగుకు యోగ్యం కాని భూములను పక్కాగా గుర్తించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూసర్వేను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ యోగ్యం నాలా లేఅవుట్లు, ఇండ్లు, ప్యాక్టరీలు, మైనింగ్ తదితర భూముల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సర్వే చేసి అర్హులైన రైతులకు రైతు భరోసా అందేలా చూడాలన్నారు. ఆయన వెంట నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మండల తహసీల్దార్ ఎన్.మధుసూదన్ రెడ్డి, ఏఓ బి.పురుషోత్తం, ఏఈఓలు ఉన్నారు.

రేషన్‌కార్డుల మంజూరుకు సర్వే

నల్లగొండ టూటౌన్ : కొత్త రేషన్‌కార్డుల మంజూరు కోసం పట్టణంలోని 48 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 20వరకు వార్డుల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు. పట్టణంలో 1540మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 21నుంచి 25వరకు వార్డుల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మునుగోడు : రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల అమలు కోసం మండలంలో అధికారులు, సిబ్బంది చేపట్టిన సర్వే రెండో రోజు శుక్రవారం కొనసాగిస్తున్నారు. గ్రామాలల్లో వ్యవసాయ భూముల్లో నిర్మించిన ఇండ్లను గుర్తించనున్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లతోపాటు రేషన్‌కార్డుకు అర్హులైనవారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఈ సర్వేను తహసీల్దార్ ఎం.నరేందర్, మండల వ్యవసాయ అధికారి పద్మజ పరిశీలించారు. వారి వెంట ఆర్‌ఐ రామచంద్రయ్య, ఏఈఓ నర్సింహ తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : ప్రభుత్వం ఈ నెల 26నుంచి అమలు చేయనున్న రైతు భరోసా పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని తమ్మడపల్లి, రాంరెడ్డిపల్లి, మేటిచందాపురం, వట్టిపల్లి, దామెరబీమనపల్లి గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బక్క శ్రీనివాసులు మాట్లాడుతూ.. రెవెన్యూ, వ్యవసాయాధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారుల వివరాలను సర్వే చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, సీనియర్ అసిస్టెంట్ ఉడావత్ శ్రీనునాయక్, ఏఈఓ విజయ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్ : సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్



మునుగోడు : పులిపలుపులలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

రాములు మృతికి ఎమ్మెల్యే నివాళులు



రాములు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : మండలంలోని వంగమర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఊడుగు రాములు(72) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం రాములు మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మృతుడికి వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే వెంట శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి గూని వెంకటయ్య, ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు బండపల్లి కొమరయ్య, షేక్ ఇంతియాజ్, నోముల జనార్దన్, బెల్లి వీరభద్రయ్య, మంగదుడ్ల శ్రీను, వేముల గోపినాథ్, పరశురాములు తదితరులు ఉన్నారు.

మాదిగల మహాగర్జన సభ కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిట్యాల : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 19న నిర్వహించనున్న మాదిగ మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పోల్లెపల్లి సత్యనారాయణ కోరారు. శుక్రవారం పట్టణంలోసభకు సంబంధించిన ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం ఉద్యోగ నోటిఫికేషన్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాగర్జన సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆవురెండి సోములు, బరాల యాదగిరి, పొన్నాల రాంబాబు, నాగిళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు వర్తింపజేయాలి

మర్రిగూడ : భూ నిర్వాసితులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు ఎరుకల నిరంజన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, కొత్త రేషన్ కార్డులు అందేలా చూడాలని కోరారు. భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

రైతు చట్టాలపై ఉద్యమించాలి

చండూరు (గట్టుప్పల్) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. శుక్రవారం గట్టుప్పల మండల కేంద్రంలో చేపట్టిన ప్రజా సంఘాల సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గట్టుప్పల మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, సుధాకర్, వెంకటేశం, యాదగిరి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సంతోష్‌యాదవ్

మర్రిగూడ : క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్‌యాదవ్ అన్నారు. మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీ ముత్యాలమ్మ రియల్‌ఎస్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం కుక్కడపు యాదయ్యగౌడ్, రమణ పాల్గొన్నారు.

సభలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25నుంచి 28వతేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అవుట రవీందర్, అద్దంకి నరసింహ, ఊట్కూరి నర్సింహారెడ్డి, సైదులు, సంజీవరెడ్డి, విజయ్‌కుమార్ ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలో గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, డబుల్ బెడ్‌రూం ఇళ్ల సాధన పోరాట కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద జరుగుతున్న పనులను వారు పరిశీలించి మాట్లాడారు.